వి. సుతేయెవ్



# వేర్వేరు చక్రాలు



# వేర్వేరు చక్రాలు

అనగా అనగా ఒక అడవిలో ఒక చిన్ని యిల్లు వుంది. ఆ చిన్నారి యింట్లో ఒక ఈగా, కప్పా, ముళ్లపందీ, కోడిపుంజూ ఉంటూ వుండేవి.

పువ్వులూ, కుక్కగొడుగులూ, చిదుగులూ, బ్రేరీపండ్లూ తీసుకు రావడానికని మన ఈగా, కప్పా, ముళ్లపందీ, కోడిపుంజూ కలసి అడవికి బయల్దేరాయి.

అవి చివరికి ఆ అడవిలో కాళీగా వున్న ఒక ప్రదేశానికి వచ్చాయి. అక్కడ ఒక చిత్రమైన చిన్న బండిని చూశాయి. ఆ బండి కాళీగా వుంది. దాని చక్రాలు ఒక దానికొకటి సరిపోల కుండా వేరువేరుగా వున్నాయి.



మొదటి చక్రం మరీ చిన్నది. రెండోది దానికంటే కొంచెం పెద్దది. మూడోది మధ్య రకంది. నాలుగోది మరీ పెద్దది.


ఆ బండి అక్కడ ఎంతో కాలంనుండి ఉండి ఉండాలి. ఎందువల్లనంటే దాని అడుగున కుక్కగొడుగులు మొలుస్తున్నాయి.

ఈగా, కప్పా, ముళ్లపందీ, కోడిపుంజూ ఆశ్చర్యపోతూ ఆ బండి వంకే చూస్తూ వుండగా ఒక కుందేలు చెంగున పొదలనుండి బయటికి దూకి వచ్చి ఆ బండివైపు చూసింది. పక్కున నవ్వింది.

"ఈ బండి నీదా?" అని అవన్నీ కలసి కుందేలును అడిగాయి.

"నాది కాదు. అది ఎలుగుబంటి బండి. దానిని తయారు చేసేందుకని ఆ ఎలుగుబంటి చాలా కాలం పనిచేసి చేసి చివరికి దానిని పూర్తి చేయలేకపోయింది. అందుకే ఆ బండి అక్కడ అలా పడివుంది."





"ఐతే మనం దీనిని యింటికి తీసుకుపోదాం. ఇది మనకు ఎందుకైనా ఉపయోగపడవచ్చు" అని అంది ముళ్లపంది.

"ఐతే పట్టుకుపోదాం పదండి" అని ఈగా, కప్పా, కోడిపుంజూ అన్నాయి.

అప్పుడు అవన్నీ కలసి ఆ బండిని తోయడం మొదలుపెట్టాయి. కాని అది అక్కడ్నుంచి కదలలేదు. దాని చక్రాలన్నీ వేరువేరు సైజులలో వున్నాయి.

అవి ఆ బండిని ఎంత తోసినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. అది ఒక పక్కకు పడిపోయింది. బాట నిండా బండి చారలూ, చెట్ల వేళ్లూనూ.

పొట్టచెక్కలయ్యేటట్టు నవ్వింది కుందేలు.

"అలాంటి పనికిమాలిన బండి ఎవరికి కావాలి?"

ఈగా, కప్పా, ముళ్లపందీ, కోడిపుంజూ ఆ బండిని తోసితోసి అలసిపోయాయి. ఐనా దానిని విడిచిపెట్టి వెళ్లడానికి యిష్టపడలేదు. అది వాటికి ఎందుకైనా పనికి రావచ్చు.



అప్పుడు ''ఒక్కొక్కరం ఒక్కొక్క చక్రాన్ని దొర్లించుకుంటూ వెళ్దాం!'' అని సలహాయిచ్చింది ముళ్లపంది.

ఇకనేం అవన్నీ తలా ఒక చక్రాన్ని తీసుకొని బాటమీద దొర్లించుకుంటూ వెళ్లడం మొదలు పెట్టాయి.

అన్నిటికంటే చిన్న చక్రాన్ని ఈగ దొర్లించింది. దానికంటే పెద్ద చక్రాన్ని ముళ్లపంది దొర్లించింది. మధ్యరకం చక్రాన్ని కప్ప దొర్లించింది. కోడిపుంజు రెక్కలు కొట్టుకుంటూ ''కొక్కొరోకో'' అని కూసుకుంటూ అన్నిటికంటే పెద్ద చక్రాన్ని యింటి దాకా దొర్లించుకుపోయింది.

కుందేలు వాటి వంకే చూస్తూ నవ్వింది.

''భలే! చిత్రమైనవే! వేరువేరు చక్రాలని యింటికి దొర్లించుకుంటూ పోతున్నారు!''


కుందేలు కుప్పి గంతులు వేసుకుంటూ మళ్లీ పొదల్లోకి వెళ్లిపోయింది.



ఈగా, కప్పా, ముళ్లపందీ, కోడిపుంజూ తమ తమ చక్రాలతో యిల్లు చేరుకోగానే ఆ చక్రాలని ఏవిధంగా ఉపయోగించుకోవడమా అని ఆలోచించడం మొదలుపెట్టాయి.




''నాకు తెలుసు'' అని అంది ఈగ. అది అన్నిటికంటే చిన్న చక్రాన్ని తీసుకొని దాంతో ఒక రాట్నం తయారు చేసింది.



ముళ్లపంది రెండు కర్రల్ని తీసుకొని వాటిని తన చక్రానికి మేకులతో బిగించింది. దాంతో ఒక చిన్న ఒంటి చక్రపు బండి తయారైపోయింది.

''నాకు కూడా ఒక ఆలోచన తట్టింది'' అని అంది కప్ప. బాల్చీని ఎక్కువ తేలికగా పైకి లాగేందుకని తన మధ్య రకం చక్రాన్ని బావి పైభాగాన అమర్చింది.





ఇహ కోడిపుంజు సంగతి. అది అన్నిటికంటే పెద్ద చక్రాన్ని నదీ ప్రవాహానికి అడ్డంగా అమర్చి ఒక జలయంత్రాన్ని తయారుచేసింది.

ఆవిధంగా ఆ బండి చక్రాలన్నీ ఉపయోగపడ్డాయి.

రాట్నంమీద దారాన్ని ఒడికింది ఈగ. తోటకి నీళ్ల పెట్టేందుకు బావినుండి నీళ్ల పట్టుకొచ్చింది కప్ప. తన ఒంటి చక్రపు బండిమీద అడవిలోనుండి కుక్కగొడుగుల్నీ, బ్రైరీపండ్లనీ, చిన్నచిన్న చిదుగులనీ తీసుకొచ్చింది ముళ్లపంది.

కోడిపుంజు తన మిల్లుమరలో పిండిని పట్టింది.


ఈగా, కప్పా, ముళ్లపందీ, కోడిపుంజూ ఎలా వుంటున్నాయో పరామర్శచేద్దామని వచ్చింది ఒక రోజున కుందేలు.

అవన్నీ కుందేలును చూడగానే ఎంతో సంతోషించాయి. దానికోసమని ఈగ వెచ్చని చేతిమేజోళ్లను అల్లింది. కప్ప తన తోటలో ఒక ముల్లంగి దుంపను తవ్వితెచ్చింది. ముళ్లపంది ఒక కుక్కగొడుగును తెచ్చింది. కోడిపుంజు ఒక రొట్టెనూ, కొద్దిగా పిండివంటనూ పట్టుకొచ్చింది.

కుందేలు సిగ్గుపడి పోయింది.

"నన్ను మన్నించండి. ఒక దాంతో ఒకటి సరిపోలని బండి చక్రాలు కూడా, వాటి నేంచేయాలో తెలిసిన వాళ్లకు ఎంతో ఉపయోగపడవచ్చు" అని అంది కుందేలు.







వేరువేరు సైజుల చక్రాలు ఈ బొమ్మల్ని తయారుచేయడంలో ఉపయోగపడ్డాయి.

రంకులరాట్నం కొరకు చేసిన చక్రాన్ని అట్టతో తయారుచేయొచ్చు. లారీ చక్రాలను కాళీగా వున్న దారపు గిరకలతో తయారుచేయొచ్చు. ఇతర వాటిని పారలచెక్కతో చేయవచ్చు. గుండీలతో కూడా చేయవచ్చు.

# చిన్ని పడవ



ఒక కప్పా, కోడిపిల్లా, చిట్టెలుకా, చీమా, ఆరుద్ర పురుగూ యివన్నీ కలసి షికారుగా బయటికి వెళ్లాయి.




త్వరలోనే ఒక నది గట్టుకు వచ్చాయి.

“స్నానం చేద్దాం పట్టండి” అంది కప్ప. అనడమే కాకుండా నీళ్లలోకి ఎగిరి గంతేసింది.


“మాకు యీత రాదే!” అని కోడిపిల్లా, చిట్టెలుకా, చీమా, ఆరుద్ర పురుగూ అరిచాయి.



"పప్పుసుద్ద – పప్పుసుద్ద, పప్పుసుద్ద! మీరెందుకూ పనికి రానివాళ్లు" అని ఉక్కిరి బిక్కిరి అయిపోయేవరకు నవ్వింది కప్ప.




కోడిపిల్ల, చిట్టెలుక, చీమ, ఆరుద్ర పురుగులకు రోషం వచ్చింది. ఏదైనా ఉపాయం ఆలోచించేందుకు ప్రయత్నించాయి. ఆలోచించీ ఆలోచించీ, చివరికి యీవిధంగా చేశాయి.




కోడిపిల్ల వెళ్లి ఒక ఆకుతో తిరిగి వచ్చింది.



చిట్టెలుక అక్రోటు పైపెంకులో సగం పెంకును పట్టుకొచ్చింది.



చీమ వెళ్లి గడ్డిపరకను తీసుకొచ్చింది.



ఆరుద్ర పురుగు ఒక పొడుగాటి నల్లదారం పోగును పట్టుకొచ్చింది.




తర్వాత అవన్నీ పనిచేయడం మొదలుపెట్టాయి. అక్రోటు పెంకు అడుగుభాగాన గడ్డిపరకను గుచ్చాయి. అలా గుచ్చిన గడ్డిపరకకు దారంతో ఆకును కట్టాయి. ఒక్క క్షణంలో ఎవరూ ఎన్నడూ చూడనటువంటి ఒక చక్కని చిన్న ప్రయాణపు పడవ సిద్ధమైపోయింది.



అవి ఆ పడవని నీళ్లలోకి తోసి, పడవలోకి వెళ్లి కూర్చుని, ప్రయాణమై వెళ్లిపోతున్నాయి.



కప్ప తన తలను నీట్లోంచి పైకెత్తి మళ్లీ నవ్వబోయింది. కాని పడవ అప్పటికి చాలా దూరం వెళ్లిపోయింది. కప్ప అందుకోలేనంత దూరానికి వెళ్లిపోయింది పడవ.




వీరు అట్టతోనూ, చెట్టు బెరడుతోనూ, లేదా కార్కు బిరడాతోనూ యిలాంటి ఓడలను తయారుచేయవచ్చు. పడవలని కాగితంతోనూ, బటాణీగింజలు తీసివేయగా మిగిలిన కాళీతొక్కతోనూ లేదా అక్రోటు పై పెంకులో సగం పెంకుతోనూ తయారుచేయవచ్చు.

వి. సుతేయెవ్

819



# వేర్వేరు చక్రాలు



# చిన్ని పడవ



"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో



చిత్రాలు రచయితవి

అనువాదం: గిడుతూరి సూర్యం




В. Сутеев

РАЗНЫЕ КОЛЕСА

*На языке телугу*

మూడవ ముద్రణ

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

C $\frac{70801-432}{014 (01)-78}$ 706-78